తల్లిపాల నిధికి ఆదరణ

దాతృత్వం చాటుతున్న మాతృమూర్తులు
పటిష్ట అమలుకు వైద్యాధికారుల చర్యలు



జిల్లా ఆసుపత్రిలోని తల్లిపాల నిధి విభాగం.. భద్రపరిచిన పాలు



అనంతపురం టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): అమ్మపాలు అమృతంతో సమానం అంటారు. తల్లి పాలు తాగితే పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అనారోగ్యాలు రావని వైద్యులు చెబుతుంటారు. వివిధ కారణాల వల్ల తల్లిపాలు పసిపిల్లలకు అందకుండాపోతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యరంగంలో అనేక కొత్త పుంతలు పుట్టుకొచ్చాయి. వృథా అవుతున్న తల్లుల పాలను నిల్వ ఉంచి అవసరమైన పసిబిడ్డలకు అందించేందుకు అనంత తల్లిపాల నిధి (హ్యూమన్ మిల్క్ బ్యాంక్) తీసుకొచ్చారు. ఒకప్పుడు ఇవి పెద్దపెద్ద నగరాలలో మాత్రమే ఉండేవి. ఆసుపత్రి వైద్యాధికారులు, కలెక్టర్ వినోద్‌కుమార్ చొరవ, దాతల సహకారంతో అనంత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. దాదాపు రూ.60 లక్షలతో తల్లిపాల నిధిని ఏర్పాటు చేసి గత నెల 8వ తేదీన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతులు మీదుగా ప్రారంభించారు. తల్లిపాలను సేకరించి భద్రపరచి అవసరమైన పిల్లలకు అందిస్తున్నారు. ప్రసవం పొందిన తర్వాత వివిధ కారణాలతో బిడ్డలను కోల్పోయిన తల్లుల పాలు వృథాకాకుండా సేకరించి చిన్నారులకు ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన తల్లిపాల నిధికి ఆదరణ కనిపిస్తోంది. పాలను భద్రపరచడానికి అవసరమైన యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో ప్రసవాలకు వచ్చిన తల్లులు పాలు వృథాకాకుండా తల్లిపాల నిధికి అందించి దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.

చాలా ఆనందంగా ఉంది



నాకు హిందూపురంలో 13 రోజుల క్రితం డెలివరీ అయింది. మగబిడ్డ పుట్టాడు. బాబుకు ఆయాసం ఎక్కువగా ఉందని, మెరుగైన చికిత్స కోసం అనంత పెద్దాసుపత్రికి పంపించారు. ఇక్కడ డాక్టర్లు నా బిడ్డను ఎస్ఎన్‌సీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఎక్కువ అయాస పడతుండడంతో పాలు తాగడానికి ఇబ్బంది పడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు తల్లిపాల నిధికి పాలు ఇస్తున్నా. నా పాలు వృథాకాకుండా ఇతర పిల్లలకు ఉపయోగపడడం ఎంతో ఆనందం కలిగిస్తోంది.

-అరుణ, బాలింత,
పాలసముద్రం, గోరంట్ల మండలం

బిడ్డకు తాపుతున్నా



నాకు ఆసుపత్రిలో ఆడబిడ్డ పుట్టింది. అనారోగ్యంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పాలు పట్టిద్దామనుకుంటే తాగలేని పరిస్థితిలో ఉంది. తల్లిపాల నిధికి వెళ్లి రోజూ యంత్రం ద్వారా పాలుపిండుకొని ఆ పాలను నా బిడ్డకే స్పూన్‌తో తాపిస్తున్నా. ఇక్కడ ఇలాంటి పాలనిధి ఏర్పాటు చేయడం అభినందనీయం.

-అఫ్రిన్, బాలింత, కదిరి

నా బిడ్డకు ఇస్తున్నట్లుగానే సంతోషపడుతున్నా..



మాది అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్. వారం రోజుల క్రితం ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చాను. నాకు ఇద్దరు మగకవల పిల్లలు పుట్టారు. తక్కువ బరువు, అనారోగ్యంగా ఉన్నారని ఎస్ఎన్‌సీయూ ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో నా పాలు వృథాకాకుండా డాక్టర్లు, సిబ్బంది సూచన మేరకు ప్రతిరోజూ తల్లిపాల నిధికి ఇస్తున్నా. నా పాలను తల్లిపాలు లేని పిల్లలకు అందిస్తున్నారంటే.. నా బిడ్డలకు పాలిచ్చినట్లే సంతోషంగా ఉంది.

-విజయవాణి, బాలింత, అనంతపురం

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం



కరువు జిల్లా అనంతలో ఇలాంటి తల్లిపాల నిధి ఏర్పాటు కావడం అదృష్టం. ఇక్కడ దీని అవసరం ఎంతో ఉంది. చాలామంది వివిధ కారణాలతో తమ పిల్లలకు పాలు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. అలాంటి పిల్లలకు తల్లిపాల నిధి ద్వారా అందించి ఆరోగ్యంగా కాపాడుకోవచ్చు. ఈ నిధికి ఇళ్లవద్ద ఉన్న తల్లులు కూడా ఇక్కడికి పంపించవచ్చు. దీనివల్ల పిల్లలకేకాదు తల్లుల ఆరోగ్యానికి చాలామంచిది. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి తల్లుల్లో చైతన్యం తీసుకొస్తాం.

-డాక్టర్ హేమలత,
డిప్యూటీ ఆర్ఎంఓ, జిల్లా ఆసుపత్రి

పటిష్ట అమలుకు చర్యలు



తల్లిపాల నిధి ఏర్పాటు కావడం ఎంతో ఆనందంగా ఉంది. దీనిని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రత్యేక నోడల్ ఆఫీసర్, డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేశాం. తల్లుల నుంచి సేకరించిన పాలను ల్యాబ్‌కు పంపించి, అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయించిన తర్వాతే భద్రపరిచి పిల్లలకు అందిస్తున్నాం. ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నాం.

-డాక్టర్ వెంకటేశ్వరరావు,
సూపరింటెండెంట్,
జిల్లా ఆసుపత్రి



రథంపై నుంచి అభిమానులకు విక్టరీ సంకేతం చూపుతున్న బాలయ్య, చిత్రంలో ఆయన సతీమణి వసుంధర

నీట్ ప్రశాంతం

2,534 మంది హాజరు.. 79 మంది గైర్హాజరు



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు (వివరాలు 7వ పేజీలో...)

భయం పోయె.. ఆనందమాయె..



నాడు.. గుంతలమయంగా రాయలచెరువు-చందన రోడ్డు

యాడికి మండలంలోని రాయలచెరువు-చందన రోడ్డు దారుణంగా ఉండేది. మోకాలి లోతు గుంతలతో ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనదారులు జంకేవారు. గుంతలను తప్పించబోయి కిందపడి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు కూడా. చాలామంది గాయాలపాలయ్యారు. రోడ్డు బాగు చేయాలని గ్రామస్థులు పదేపదే వినతులు ఇచ్చారు. ధర్నాలు కూడా చేశారు. అయినా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవతో రాయలచెరువు-చందన రోడ్డు పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఆయాగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-యాడికి (ఆంధ్రజ్యోతి)



నేడు.. కొత్తగా వేసిన తారురోడ్డు

చేయి.. చేయి.. కలిపి...

యాడికి, మే4(ఆంధ్రజ్యోతి): చారిత్రక సంపదనకు కాపాడుకునేందుకు ఊరంతా ఏకమైంది. చేయి.. చేయి.. కలిపింది. శతాబ్దాల చరిత్ర గల కోనేటిని శుభ్రం చేసింది. మండలంలోని నిట్టూరులో శతాబ్దాల క్రితం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణలోనే శ్రీకృష్ణదేవరాయలు అద్భుత కళాఖండంగా కోనేటిని ఏర్పాటు చేశారు. అలాంటి ఘనచరిత్ర కలిగిన కోనేరు చెత్తాచెదారంతో నిండిపోయి, అపరిశుభ్రంగా తయారైంది. చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో కోనేటిని శుభ్రం చేసుకుందామని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. ఆదివారం గ్రామస్థులంతా కలిసి కోనేటిలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. దీంతో కోనేరు ఎంతో శుభ్రంగా తయారైంది.

పురాతన కోనేటిని శుభ్రం చేస్తున్న గ్రామస్థులు



మాతృమూర్తి ఘనతను చాటిన సచ్చిదానందస్వామి

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

రాప్తాడు, మే 4(ఆంధ్రజ్యోతి): తన మాతృమూర్తి జయలక్ష్మమాతను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప మహనీయుడు మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో గణపతి సచ్చిదానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన జయలక్ష్మీమాత జయంతి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నరహరి వేద విద్యానిలయం, జయలక్ష్మీమాత వేద వైద్యశాల, అన్నపూర్ణ మందిరం ప్రారంభోత్సవంలో ఆదివారం కేశవ్‌తో పాటూ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. వారందరూ గణపతి సచ్చిదానందస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం సచ్చిదానందస్వామి ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారని తెలిపారు. స్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పుట్టిన ఊరును, కన్న తల్లిని ఎవరూ మరువకూడదని, వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టే అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఈ ఆశ్రమం ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. మైసూరు దత్తపీఠం తరహాలో బొమ్మేపర్తి ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలన్నారు. జయలక్ష్మీమాత జయంతి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై సచ్చిదానందస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్

నేడు బుక్కరాయసముద్రంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మండలంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆ మండల పరిధిలోని చెరువుకట్ట మీద ఉన్న షిర్డీసాయి ఆలయంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

పగలే దారి దోపిడీ

- గొర్రెల వ్యాపారి నుంచి రూ.6.80లక్షలు లాక్కెళ్లిన దొంగలు
- ఘటనపై ఎస్పీ సీరియస్
- వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు (7లో..)

తాడిపత్రిలో హైటెన్షన్

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాక నేపథ్యంలో పోలీసుల్లో ఆందోళన

అడ్డుకుంటామన్న మున్సిపల్ చైర్మన్
ఇరువర్గాల నాయకుల్లో కేసుల భయం





తాడిపత్రి, మే4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తారన్న సమాచారంతో సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఎలాంటి ఘర్షణలు తలెత్తుతాయోనన్న ఆందోళనలో పట్టణ ప్రజలు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తలెత్తిన గొడవల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి.. తాడిపత్రి బహిష్కరణకు గురైన విషయం తెలిసిందే. ఆయన హైకోర్టు అనుమతితో తాడిపత్రికి వస్తున్నట్లు తెలిసింది. ఆయన వస్తే.. అడ్డుకుంటామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు. దీంతో సర్వత్రా టెన్షన్ నెలకొంది.

అడ్డుకుంటాం..

తాడిపత్రిలో గత ఎన్నికల సమయంలో దాడులు, ప్రతిదాడులతో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. దీంతో అప్పట్లో ఇరువర్గాలను కొన్నినెలలపాటు తాడిపత్రిలో ఉండకూడదని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇరువర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎన్నికల్లో కూటమి గెలిచి, అధికారం చేపట్టినా దాదాపు నాలుగునెలల తర్వాత మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తాడిపత్రిలో అడుగుపెట్టారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కూడా తాడిపత్రికి రావాలని శతవిధాలా ప్రయత్నించినా కుదరలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం హైకోర్టు అనుమతితో పెద్దారెడ్డి తాడిపత్రికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అటు పోలీసులు, ఇటు ప్రజల్లో శాంతిభద్రతల భయం వెంటాడుతోంది. వీటన్నింటినీ పక్కనబెట్టి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి.. పెద్దారెడ్డిని మాత్రం నియోజకవర్గంతోపాటు తాడిపత్రికి రానిచ్చేది లేదని పలు సందర్భాల్లో మాట్లాడారు. 'గతంలో ఎస్పీ రవీంద్రారెడ్డి అలియాస్ పొట్టి రవి మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినా.., హైకోర్టు పర్మిషన్ ఇచ్చినా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తొత్తుగా వ్యవహరించిన అప్పటి డీఎస్పీ చైతన్య తాడిపత్రికి వచ్చినా.. ఇంటికి వెళ్లనీయకుండా జిల్లా దాటించి కర్ణాటక సరిహద్దు వరకు పంపినపుడు అధికారులు ఏమయ్యారు? ఇప్పుడు హైకోర్టు పర్మిషన్ ఇచ్చిందంటూ పెద్దారెడ్డి తాడిపత్రిలోకి వస్తున్నానని చెప్పడం ఎంతవరకు సమంజసం? నాకు, నా అనుచరులకు ఒక న్యాయం, అవతలి వ్యక్తికి మరో న్యాయమా?' అప్పుడు బహిష్కరించిన అధికారులు.. ఇప్పుడు కూడా అదే చర్య తీసుకోవాలి. అలా ఎందుకు చేయడం లేదు? స్వయానా పోలీసుల భద్రతతో తాడిపత్రికి వస్తున్నాడని తెలుస్తోంది. మా అనుచరులను మమ్మల్ని ఇబ్బంది పెట్టిన వ్యక్తిని తాడిపత్రికి రానిచ్చే ప్రసక్తే లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే జేసీపీఆర్ పెద్దవడుగూరు, యల్లనూరు మండలాల ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి, చర్చించారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఎవరూ గ్రామాల నుంచి రావొద్దని సూచించారు. సమస్య తనకు, పెద్దారెడ్డికి మధ్య మాత్రమేననీ, కార్యకర్తలు వచ్చి ఇబ్బందులు పడొద్దని సూచించారు. రెండు కుటుంబాల మధ్యన జరిగిన దానికి ప్రజలు నలిగిపోకూడదని జేసీపీఆర్ ఆవేదన వెలిబుచ్చారు.

ఇరువర్గాల నాయకుల్లో కేసుల భయం

ఇప్పటికే పోలీసు అధికారులు.. నాయకులకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. రెండురోజులక్రితం తాడిపత్రి కళాశాల గ్రౌండ్‌లో రాళ్లు తేలారని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వీటిని దృష్టిలో పెట్టుకుని, నాయకులు, రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. అల్లర్లు సృష్టించి ఘర్షణల్లో పాల్గొన్నట్లయితే కేసులు నమోదుచేసి, రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరిస్తామనీ, అవసరమైతే పీడీయాక్ట్ వంటి కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో నాయకుల్లో గుబులు పట్టుకుంది. ఘర్షణల్లో పాల్గొన్నా.., పరామర్శించినా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని నాయకులు చర్చించుకుంటున్నారు.

నేడో.. రేపో.. తాడిపత్రికి పెద్దారెడ్డి

హైకోర్టు పర్మిషన్‌తో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి ఒకట్రెండు రోజుల్లో రానున్నారని విశ్వసనీయ సమాచారం. దీంతో తాడిపత్రిలో శాంతిభద్రతలకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి.. పట్టణ, రూరల్ సీఐలతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఇరువర్గాలకు ఎలా సర్దిచెప్పాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరికి నచ్చజెప్పాలని ప్రయత్నించినా ఎలాంటి సమస్య తలెత్తుతుందోనని ఉన్నతాధికారుల్లో భయం నెలకొంది. ఇప్పటికే గత ఎన్నికల్లో చేసిన పొరబాట్ల కారణంగా ఎస్పీ, డీఎస్పీ, సీఐ అధికారులు సస్పెండ్, వీఆర్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు.. తలలు పట్టుకుంటున్నారు.

క్రైం కార్నర్

పోటీ పరీక్షలకు వెళ్తూ... గాయపడిన విద్యార్థిని


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయివర్షిణి

కొత్తచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని సాయినగర్‌కు చెందిన గంగాద్రి కుమార్తె సాయివర్షిణి పోటీ పరీక్షలకు వెళ్తూ ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు సాయివర్షిణి సత్యసాయి యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అనంతపురంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం కాంపిటేటివ్ పరీక్ష రాయడానికి తండ్రితో కలిసి ఆర్టీసీ బస్సులో వెళ్తోంది. అయితే కొత్తచెరువులోకి ఆర్టీసీ బస్సురాగానే ఆ విద్యార్థిని చెయ్యి విండో పక్కపెట్టుకుంది. రోడ్డుకు అడ్డంగా కారు ఉండటంతో కుడిపక్కకు బస్సు వెళ్లింది. ఈ సమయంలో కనకదాసు విగ్రహానికి విద్యార్థిని చెయ్యి బలంగా తగిలింది. దీంతో చెయ్యి నుజ్జునుజ్జుఅయింది. వెంటనే తండ్రి, స్థానికులు హుటాహుటిన సూపర్ స్పెషల్ ఆస్పత్రికి ఆటోలో తరలించగా అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు


- రూ.4.02 లక్షల నగదు.. మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన శ్యామల రాజశేఖర్, శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన పెమ్మక సుధీర్‌రెడ్డి, పెమ్మక భాస్కర్‌రెడ్డి జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌ను ఎంచుకున్నారు. యువకులను బెట్టింగ్ ఊబిలోకి దించుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లపై భారీగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శింగనమల సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో గార్లదిన్నె, శింగనమల ఎస్‌ఐలు మహ్మద్ గౌస్, విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు అంజన్‌రెడ్డి, కృష్ణ, నాగేష్, దివాకర్, నరేష్, వెంకటేష్, అమర్నాథ్ ఆదివారం ఉదయం కల్లూరులో రాజశేఖర్ ఇంటి వద్ద సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.02 లక్షలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పగలే దారి దోపిడీ

- గొర్రెల వ్యాపారి నుంచి రూ.6.80లక్షలు లాక్కెళ్లిన దొంగలు
- ఘటనపై ఎస్పీ సీరియస్
- వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు


బాధితుడు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని చెరువు సమీపం ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ఆదివారం పట్టపగలే దారి దోపిడీ జరిగింది. గొర్రెల వ్యాపారి చెరుకూరి నారాయణస్వామి వద్ద నుంచి గుర్తుతెలియని దుండగలు రూ.6.80 లక్షలు లాక్కెళ్లిన ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనంతపురం రూరల్ ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెల వ్యాపారి వద్ద నుంచి గొర్రెలు కొనుగోలు చేసేందుకు రూ.6.80లక్షల నగదును ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. చెరువు గట్ట పక్కనే ఉన్న రోడ్డు నుంచి ఉప్పరపల్లి గ్రామానికి వెళుతున్నాడు. రోడ్డు మధ్యలో ముళ్ల పొదల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి టూవీలర్ ఆపి, వ్యాపారిని కొట్టి అతని వద్ద నుంచి రూ.6.80లక్షలను లాక్కెళ్లారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు హిందీలో మాట్లాడుతున్నారని బాధితుడు తెలిపాడు. వ్యాపారం నుంచి వచ్చిన డబ్బులు అన్నీ పోగుచేసి గొర్రెలు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా ఇలా జరిగిందని బాధితుడు వాపోయాడు. విషయాన్ని వెంటనే బాధితుడు బంధువులకు తెలపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని దొంగలు కోసం గాలించారు. అప్పటికే వారు పరారీ అయ్యారని తెలిపారు. దోపడీ జరిగిన విషయాన్ని వెంటనే బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ జగదీష్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కేసును త్వరితగతిన ఛేదించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఆదేశించినట్లు తెలిసింది. బాధితుడితో డీఎస్పీతో పాటు ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, బీకేఎస్ సీఐ పుల్లయ్య, సీసీఎస్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి సంఘటనపై ఆరా తీశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.


బాధితుడి బంధువులతో ఆరాతీస్తున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

రేపు మెగా జాబ్‌మేళా

ముదిగుబ్బ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఇబ్రహీం పట్నం ఐటీఐ ఆధ్వర్యంలో మేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకర్ ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు ఏదైనా డిగ్రీ, ఐటీఐ చదివినవారు అర్హులన్నారు. శ్రీసిటీకి చెందిన టీవీఎస్, టీఎస్ కంపెనీలు ఈ నెల 6వ తేదీ ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, వివరాల కోసం 9959890237, 9059282875, 9014219369 నంబర్లను సంప్రదించాలన్నారు.

పద్మభూషణుడికి సన్మానం..
పులకించిన పురం..!

- ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘనంగా పౌరసన్మానం
- కిక్కిరిసిన పురం రోడ్లు
- 20వేల మందికిపైగా హాజరు

హిందూపురం, మే 4(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పట్టణంలో ఆదివారం ఘన సన్మానం చేశారు. పద్మభూషణ్ అవార్డు అందుకుని మొదటిసారిగా హిందూపురం వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణకు టీడీపీ నాయకులు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పౌరసన్మానసభ ఏర్పాటు చేశారు. ఆదివారం ఎంజీఎం క్రీడా మైదానంలో అంగరంగ వైభవంగా కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంతోపాటు జిల్లా, కర్ణాటక నుంచి 20వేల మందికిపైగా జనం వచ్చారు. ఎంజీఎం క్రీడామైదానం నిండిపోయి రోడ్లపైనే జనం ఆగిపోయారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు పాటలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో చూపరులను కట్టిపడేశారు. ఈ సందర్భంగా నాయకుల, అభిమానులు ప్రత్యేకంగా వెండితో తయారు చేయించిన సింహాసనం, గద, కత్తి, పిల్లనగోవి, కిరీటాన్ని బాలయ్యకు బహూకరించారు.

గుర్రాల రథంపై ఊరేగింపు

మొదట రహమత్‌పురం సర్కిల్ చేరుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. అక్కడి నుంచి గుర్రాల రథంపై ఎంజీఎం క్రీడా మైదానానికి సతీమణి వసుంధరాదేవితో కలిసి వస్తుండగా నాయకులు, అభిమానులు భారీ గజమాలతో స్వాగతం పలికారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

ఈ సత్కారం మరచిపోలేనిది..



సభావేదికపై ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. జీవితంలో ఈ సత్కారం మరిచిపోలేనిదన్నారు. ఎప్పటికీ హిందూపురాన్ని తమ కుటుంబం మరిచిపోదన్నారు.

అపర భగీరథుడు.. బాలయ్య..

బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. హిందూపురం ప్రాంత ప్రజల దాహార్తి తీర్చడానికి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేసిన అపర భగీరథుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అని కొనియాడారు. రాజకీయ, సినీరంగాల్లో ఎందరికో అండగా నిలుస్తున్నారన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. హిందూపురం టీడీపీ కంచుకోట అన్నారు. ప్రజల అభిమానం బాలకృష్ణపై ఎప్పటికీ ఉంటుందన్నారు. తాగు, సాగునీరు ఆసుపత్రి అభివృద్ధి ఆయనకే సాధ్యమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రియల్ హీరో బాలకృష్ణ అన్నారు. ఆయన ఎవరికి ఆపద వచ్చినా అండగా నిలుస్తారన్నారు. ఆయన చేస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జిల్లాలో ఎమ్మెల్యేగా ఉండటం అందరి అదృష్టమన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. బాలకృష్ణ తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకుని సినీరంగంలో రాణిస్తూ మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందిస్తున్నారన్నారు. ఆయనకు ఆయనే సాటి అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ.. బాలకృష్ణ అభిమానం, ఆయన చేసే సేవ కళ్లారా చూశామన్నారు. తన అత్తకు ఆరోగ్యం బాగలేనపుడు ఆయన చూపిన ప్రేమ, చేసిన సేవ ప్రశంసనీయమన్నారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. హిందూపురంలో ఒకప్పుడు రూ.10 బిందె నీరు కొనాల్సి వచ్చేదనీ, బాలయ్య పుణ్యమా అంటూ సాగు, తాగునీరు కృష్ణాజలాలను అందిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. సినీరంగంలో బాలకృష్ణకు సాటి ఎవరూ లేరన్నారు. ఆయన డైలాగులు వింటేనే సినిమా ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మెన్ అనిల్‌కుమార్, రావిళ్ల లక్ష్మి, నాయకులు నాగరాజు, బేవనహళ్లి ఆనంద్‌కుమార్, మంగేష్, వెంకటేశ్, అమర్నాథ్, చంద్రమోహన్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.


వెండి నామాల జ్ఞాపికను అందజేస్తున్న పట్టణ నాయకులు

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలతో బాలకృష్ణ దంపతులు


వివాదాలు లేకుండా టీచర్ల బదిలీలు చేపట్టాలి

- ఎమ్మెల్సీకి పీఆర్టీయూ నేతల వినతి


ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీచర్ల బదిలీలు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరారు. ఆదివారం అనంతపురం వచ్చిన ఎమ్మెల్సీని పీఆర్టీయూ నేతలు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కలిశారు. వారు మాట్లాడతూ సెలవుల్లోనే టీచర్ల బదిలీలు త్వరగా జరిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి తగ్గించేలా చూడాలన్నారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక క్లాసులకు హాజరయ్యే టీచర్లకు ఈఎల్స్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. డీఈఓ పూల్‌లో ఉన్న లాంగ్వేజ్ పండిట్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఉర్దూ స్కూళ్లలో తెలుగు పోస్టు కొనసాగించాలన్నారు. ఎలాంటి కోర్టు వివాదాలకు తావు లేకుండా బదిలీలు నిర్వహించేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఎమ్మెల్సీకి వినతిపత్రం అందించారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, చితంబర్‌రెడ్డి, శివారెడ్డి, బాబయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్, జగన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ యూనియన్ నేతల వినతి...

ఎమ్మెల్సీ గాదెను అపుస్మా నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12.1(సీ)కి సంబంధించిన సమస్యలను, ఇతర విషయాలను ఎమ్మెల్సీకి వివరించారు. అనంతరం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు పుల్లారెడ్డి, నాయుడు, సుబ్బారెడ్డి, రవిశంకర్ ప్రసాద్, నాగరాజు, మహమ్మద్ ఇక్బాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

గౌస్‌మొద్దీన్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు


గౌస్‌మొద్దీన్‌కు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

అనంతపురం అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్‌కు సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం హిందూపురంలోని రక్షా అకాడమిలో బాలకృష్ణను గౌస్ కలిశారు. గౌస్ మొద్దీన్‌కు బాలకృష్ణ స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి గౌస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం: ఎమ్మెల్సీ

పుట్టపర్తి, మే 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆదివారం ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనకు సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు రూ.6కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. త్వరలో రెండో విడత నిధులను విడుదల చేయనుందన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు పీవీ రమణారెడ్డి, సురేశ్‌బాబు, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, రజనీకాంత్‌రెడ్డి, సౌదామిని, నారాయణస్వామి పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా నాలుగోసారి శంకర్‌నారాయణ


ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ట్రెజరీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకులుగా కిరణ్‌కుమార్, రవికుమార్, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రమోహన్ వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా శంకర నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఫరూక్‌మహ్మద్, ఉపాధ్యక్షులుగా సుమనలత, జగదీష్, శ్రీనివాసరావు, వాసుమూర్తి యాదవ్, కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శులుగా సాదిక్ ఖానం, శ్రీనివాసులు, రాజేష్, కోశాధికారిగా అనంతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తిరుమలరెడ్డి, కిశోర్ కుమార్ చౌదరి, ఉమేషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఉద్యోగులకు అనుకూలంగా ఉండే కూటమి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏటీఓ రాణి, ఏపీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జడ్పీ ఆడిట్ ఉద్యోగుల సంఘం దస్తగిరి, ఆర్‌అండ్‌బీ శ్రీధర్, అగ్రికల్చర్ ఉద్యోగుల సంఘం, డీఎస్ఏ ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మోదీ.. చంద్రబాబుతోనే వర్గీకరణ సాకారం

- మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ సభలో ఎంఎస్ రాజు

అనంతపురం సెంట్రల్, మే 4(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలాలు వర్గీకరణ రూపంలో మాదిగ జాతికి అంకితమనీ, ఇది కేవలం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడుతోనే వర్గీకరణ చట్టం రూపుదాల్చిందని ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, జయసూర్య, గిత్తా దస్తగిరి అన్నారు. ఆదివారం మానినేని గ్రాండ్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గుత్తా జయసూర్య శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం 30 సంవత్సరాలు ఉద్యమాన్ని నడిపిన స్ఫూర్తిదాత మందకృష్ణ మాదిగ అని పేర్కొన్నారు. 1999 నుంచి 2004వరకు టీడీపీ ప్రభుత్వంలో తొలిసారిగా చంద్రబాబు వర్గీకరణ అమలుచేశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ ఇలా ఒక్కో పార్టీతో ఒక్కోసారి కలిసి మీటింగ్‌లు పెడతారని మందకృష్ణ మాదిగను విమర్శించారన్నారు. రాజ్యాధికారంలోకి వచ్చే పార్టీలతో స్నేహ హస్తం చాటాల్సిన సందర్భాల్లో చేయిచాచడని, యుద్ధం చేయాల్సిన సమయంలో యుద్ధం చేశాడన్నారు. శింగనమల ఎమ్మెల్యే కావాలని బండారు నారాయణస్వామి దాదాపు 20సంవత్సరాలు పోరాటం చేశారన్నారు. అదేస్ఫూర్తితో మనవరాలిగా బండారు శ్రావణిశ్రీ నిలబడి ఎమ్మెల్యేగా కలను సాకరం చేసిందన్నారు. అనంతరం కల్యాణదుర్గం ఎంఈఎఫ్ బృందం పాటలు పాడారు. వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన వారితో ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి సత్కరించారు. అదేవిధంగా ఎంఎస్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సైదన్న, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ భాస్కర్‌బాబు, డాక్టర్ మహేష్‌బాబుతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు బిక్షాలు, ఉపాధ్యక్షులు గంగాధర్, నాయకులు సాకే అమర్నాథ్, నాగేంద్రనాథ్, రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, జయసూర్య, గిత్తా దస్తగిరిని సన్మానిస్తున్న దృశ్యం

నీట్ ప్రశాంతం


పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

అనంతపురంటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యలో ప్రవేశం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీట్ పోటీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2,613 మంది అభ్యర్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 2,534 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరైనట్లు కలెక్టరు తెలిపారు. పరీక్షల నిర్వహణ పగడ్బందీగా కొనసాగించారు. అభ్యర్థులను పక్కాగా పరిశీలించిన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టరు వినోద్‌కుమార్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. మొత్తం మీద నీట్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండోరోజూ కొనసాగిన గ్రూప్-1 పరీక్షలు

యుపీఎస్సీద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రెండోరోజు కొనసాగాయి. ఆదివారం పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్, శ్రీబాలాజీ పీజీ కాలేజ్‌లలో పరీక్షలు కొనసాగాయి. 594మంది అభ్యర్థులు హాజరకావాల్సి ఉండగా 384మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారు. 210మందిఅ గైర్హాజరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శంకరయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది రాయలసీమ బలిజమహాసంగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో 550పైబడి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన బలిజ విద్యార్థులు టీసీ, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో 27వ తేదీలోపు శ్రీనివాస్‌నగర్‌లోని బాలాజీ కళ్యాణమండపానికి పోస్ట్ ద్వారా లేదా నేరుగా అందజేయాలన్నారు. జూన్ 1న ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9866419693, 9490180177 నంబర్లను సంప్రదించాలన్నారు.

కనకదాస ప్రతిభా పురస్కారాలకు..: శ్రీ కనకదాస విద్య, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అందించే ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఉమ్మడి అనంత జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11వ తేదీన గుత్తి రోడ్డులోని కనకదాస కల్యాణమండపంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8500237622, 9704515484 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొత్తచెరువు: బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారానికి 8వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం వ్యవస్థాపకుడు కటిక జయరాం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివి పదో తరగతిలో 540పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఈ పురస్కారాలను ఏపీ ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకోసం 94407 05369, 94916 63388 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఎంపీని సన్మానించిన చైర్మన్


ఎంపీ అంబికాను సన్మానిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్

గార్లదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను నగర శివారులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎం ఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

పిల్లలకు బైక్‌లు ఇవ్వకండి

● ట్రాఫిక్ పోలీసుల సూచన

అనంతపురం క్రైం, మే4(ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహ నాలిచ్చి ప్రమాదాలకు అవకాశం ఇవ్వద్దని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఆదివారం నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ ప్రాంతాల్లో వాహనాలు నడుపుతున్న మైనర్లకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సెలవుల్లో ఇంటి వద్దే ఉంటారని, వారికి వాహనాలిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

అనంతపురం క్లాక్‌టవర్, మే 4(ఆంధ్రజ్యోతి): కిషోర్ శుభం కన్వెన్షన్‌హాల్, కిషోర్ జాలీబాయ్స్ ఆర్కెస్ట్రా-ఈవెంట్స్ సహకారంతో ఆదివారం స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. పెద్ద సంఖ్యలో పేదలు, వృద్ధులు హాజరై కంటి పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు అందుకున్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సక్షమ్ కార్యకారిణి అధ్యక్షుడు వేణుగోపాల్, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీ గాయని జానకికి స్వర నీరాజనం


కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

అనంతపురం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): సినీగాయని ఎస్ జానకి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్, పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సంగీత కళా కారులు స్వరనీరాజనం పలికారు. హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు ఆవరణలోని ఘంటసాల మండపం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి డీఆర్‌ఓ మలోల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, జీవీ రామయ్య, ఓబుళదాస్, సుధాకర్ బాబు, మల్లికార్జున, శాంతిప్రియ, నాగరాజు, బృంద, శ్రీదేవి, జ్ఞానశేఖర్, మనోజ్, రసూల్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసరి జయంతి

అనంతపురం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కమిటీ కోఆర్డినేటర్, సినీ రచయిత సాయి పవన్‌కుమార్ సమక్షంలో కమలానగర్‌లోని వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ సహకారంతో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. భువనేశ్వరి ఫిల్మ్ స్టుడియోస్ నిర్మాత భువన, రాములమ్మ, నరసింహులు, దేవా ప్రశాంత్, రామకృష్ణారెడ్డి, నాగమునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

అనంతపురం టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పేదబీటెక్ విద్యార్థిని చదువుకు అఖిల భారత కాకతీయ ఉద్యోగుల సేవా సంఘం తమవంతు చేయూత అందించింది. శ్రీ సత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి మండలం పెద్ద మొగలాయలపల్లికి చెందిన పేద విద్యార్థిని బీటెక్ చదువుతోంది. ఆమె కోసం కాకతీయ ఉద్యోగుల సేవాసంఘం సభ్యులు ఒక్కొక్కరు కొంత డబ్బు జమ చేసి, రూ. 50వేలు విలువచేసే ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కమ్మభవన్‌లో కమ్మ సంఘం సహాధ్యక్షుడు బాంబే డైయింగ్ నాగన్న, అనూరాధ ఏజెన్సీ అధినేత శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థినికి అంద జేశారు. నాయకులు కత్రిమల ప్రభాకరచౌదరి, కేశినేని మల్లి కార్జున, నాగాంజనేయులు, మురళి, దగ్గుబాటి ప్రకాష్, రామ లింగప్ప, సాయిప్రసాద్, చల్లా ఓబిళేసు, వెంకటాద్రి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● మహిళ మృతి

చెన్నేకొత్తపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. అనంతపురానికి చెందిన మున్నీ(39) తమ సమీప బంధువు హుస్సేన్‌సాబ్‌తో కలిసి ద్విచక్రవాహనంలో పెనుకొండ నుంచి అనంతపురం వెళ్తోంది. ఎర్రంపల్లి సమీపంలో జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో మున్ని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా హుస్సేన్‌సాబ్ తీవ్రంగా గాయపడ్డాడు. సీకేపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నితిన్‌రాజ్ డ్యాన్స్ స్టుడియో, డాన్స్ మాస్టర్ నితిన్ వారి బృందంచే జానపద, సినీ గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణా..?

కనీస సౌకర్యాలు లేని కుట్టు శిక్షణ కేంద్రం

ఇలా వచ్చి అలా వెళుతున్న మహిళలు

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

శింగనమల, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ అభాసుపాలవుతోంది. కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చేపట్టిన కార్యక్రమం వారికి శిక్షలా మారుతోంది. శిక్షణ కేంద్రం వద్ద మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. అక్కడ మహిళలకు బాత్రూములు కూడా లేకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండిపోయి ఉక్కపోతతో అల్లాడిపోతుంటే.. కనీసం తాగునీరు, ఫ్యాన్లు కూడా లేకపోవడంతో శిక్షణకు వచ్చిన మహిళలు ఫేస్‌యాప్‌లో హాజరు వేసి తిరిగి వెళ్లిపోతున్నారు. ప్రారంభం నుంచి ఉత్తుత్తి శిక్షణే కొనసాగుతోందని మహిళలు అంటున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో శింగనమలలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను ఈనెల 9న ప్రారంభించారు. రెండు షిఫ్టుల్లో 60 మంది చొప్పున 120 మంది మహిళలకు 90 రోజులు శింగనమలలోని రైతు ఉత్పాదక భవనంలో శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి కుట్టు మిషన్లపై ఒక్కగంట శిక్షణ ఇచ్చిన సందర్భం కూడా లేదు.


కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

హాజరు వేసి వెళ్లిపోతున్నాం



శిక్షణ తరగతు లు ప్రారంభం నుంచి రోజూ చార్జీలు పెట్టుకుని శింగనమలకు వచ్చి ఫేస్‌యాప్ లో హాజరు వేసి వెళ్లిపోతున్నాం. రెండు గంటల పాటు శిక్షణ ఇచ్చిన సందర్భం లేదు. మిషన్ల మీద ఒక్క గంట కూడా కూర్చోలేదు. కేవలం ఈ శిక్షణ షోగానే ఉంది. అధికారులు వచ్చి శిక్షణ కార్యక్రమం జరిగే విధంగా చూడాలి.

-కవిత, ఈస్టు నరసాపురం

పెద్ద భవనానికి రెండే ఫ్యాన్లు



శిక్షణ కేంద్రం పెద్ద భవనంలో ఏర్పాటు చేశారు. అంత పెద్ద భవనానికి రెండు ఫ్యాన్లు మాత్రమే ఏర్పాటు చేశారు. అసలే ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతలో అరగంట కూడా ఉండలేకపోతున్నాం..ఎక్కువ సంఖ్యలో ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే శిక్షణ సజావుగా జరుగుతుంది. అధికారులు ఎవరూ రావడలేదు. ఇలాగైతే శిక్షణ అర్ధంతరంగా ఆగిపోవడం ఖాయం.

-పెద్దక్క, గోవిందరాయునిపేట

బాత్రూములే లేవు



కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రానికి 120 మంది మహిళలు వస్తున్నారు. ఇలాంటి చోట ఒక్క బాత్రూం కూడా లేదు. బాత్రూముకు వెళ్లాలంటే బయటికి పోవాలి. ఈ ప్రాంతంలో నిత్యం జనాలు తిరుగుతుంటారు. ఇప్పటికైనా అధికారులు బాత్రూములు ఉండే చోట శిక్షణ కేంద్రాన్ని నిర్వహించాలి.

-వెంకటమ్మ, గోవిందరాయునిపేట

కనీసం నీరు కూడా లేదు



అసలే ఎండల మండిపోయి ఉక్కపోతతో అల్లాడిపోతున్నాం. శిక్షణ కేంద్రంలో ఫ్యాన్లు లేకపోవడంతో ఉండలేకపోతున్నాం. అక్కడ తాగడానికి గుక్కెడు నీటిని కూడా ఏర్పాటు చేయలేదు. రోజూ శిక్షణకు వచ్చి అర గంట ఉండి వెళ్లిపోతున్నాం. ఇలా శిక్షణ ఇస్తే ఏం నేర్చుకుంటాం.

-అమీనా, ఈస్టు నరసాపురం

త్వరలో వేరే భవనంలోకి మారుస్తాం

నియోజకవర్గం కేంద్రం శింగనమలలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. శిక్షణ తరగతులు ప్రారంభించాలనే ఉద్దేశ్యంతో ఈ భవనంలో ఏర్పాటు చేశాం. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేనిమాట వాస్తవమే. త్వరలో అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలోకి మార్చి శిక్షణ కేంద్రాన్ని కొనసాగిస్తాం.

-గీత, కుట్టు శిక్షణ నియోజకవర్గ కోఆర్డినేటర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలపరిధిలోని చిన్మయ్‌నగర్ సమీపంలో టిడ్కో ఇళ్ల విద్యుత్ లైన్ పనులు చేపడుతున్న సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జేఎన్‌టీయూ కాలేజీ, ఎల్‌ఐసీ కాలనీ, చిన్మయ్‌నగర్, సుశీలారెడ్డి కాలనీ, ఎల్ఆర్‌జీ స్కూల్, ఎస్వీ హోమ్స్, ఇందిరమ్మకాలనీ, జేసీ రేణుక వెంచర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

అనంతపురం క్లాక్‌టవర్, మే4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేదలకు ఎన్నో ఏళ్లు గావిశేష సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల అనుమతికి సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించాలని తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శి లక్ష్మన్న కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పంపిన లేఖను ఆయన విడుదల చేశారు. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలకు సేవ చేస్తున్న ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్దరించాలని కోరారు.

పశువుల సంత ఆదాయం రూ.3.82 లక్షలు

అనంతపురం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో మార్కెట్‌కు రూ.3.82 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2.38 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.44 లక్షలు వచ్చిందని తెలిపారు.

గౌస్‌మొద్దీన్‌కు జన్మదిన శుభాకాంక్షలు


గౌస్‌మొద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్‌కు ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గంగారామ్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం గౌస్‌మొద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, నందమూరి బాలకృష్ణ అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అలాగే టీడీపీ మైనార్టీ నాయకులు షౌకత్‌ఖాన్, కరీముల్లా, నాయకులు హరీష్‌రెడ్డి, మహేష్, చరణ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ మైనార్టీ నాయకులు

వైసీపీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

● మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎంపీ గోరంట్లమాధవ్

చెన్నేకొత్తపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): గత నెలలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రామగిరి పర్యటనలో పోలీసుల వైఫల్యం ఉందనీ, దానిని కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, ఆ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎంపీ గోరంట్లమాధవ్ పేర్కొన్నారు. వైసీపీ నాయకుల అరెస్టు విషయం తెలుసుకున్న వారు ఆదివారం చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్ వద్దకు వచ్చారు. అరెస్టు అయిన వారిని పరామర్శించారు. కేసు వివరాలతోపాటు నాయకుల అరెస్టుకు సంబంధించి రామగిరి సీఐ శ్రీధర్‌తో చర్చించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... జగన్‌పర్యటనలో అడుగడుగునా భద్రత విషయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైసీపీపై నెపాన్నినెట్టి తమ పార్టీ నాయకలను తెల్లవారుజామునే ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టులు చేశారన్నారు. తప్పుడు కేసులకు వైసీపీ భయపడదన్నారు.

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండండి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


రైతు రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, మే 4 (ఆంధ్రజ్యోతి): అకాలంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఈదురుగాలులు వర్షానికి బుక్కయసముద్రం కొర్రపాడు గ్రామానికి చెందిన రైతు రవి కోళ్లషెడ్ పూర్తి స్థాయిలో దెబ్బతింది. ఎమ్మెల్యే ఆదివారం అధికారులతో వెళ్లి షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శుక్రవారం రాత్రి వర్షాలకు శింగనమల మండలంలో వరి పంటకు పూర్తి స్థాయిలో నష్టం జరిగిందని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి రైతు న్యాయం చేయాలని సూచించారు. అలాగే రైతు రవిని ప్రభుత్వం ద్వారా అందుకుంటామన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నగర కమిటీ ఎన్నిక


ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర కమిటీ

అనంతపురం టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర నూతన కమిటీ ఎన్నికైంది. ఆ సంఘం జిల్లా కార్యాల యంలో ఆదివారం సమావేశమై కమిటీని ఎన్ను కున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామునాయక్, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ ఎన్ని కల అధికారులుగా వ్యవహరించారు. వారిసమక్షంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. నగర అధ్యక్షుడిగా షేక్ రఫీ(జడ్పీ), ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్ (మె డికల్)ను ఎ న్నుకున్నారు. అలాగే కోశాధికారిగా మౌలాసాహెబ్, సహాధ్యక్షులుగా ఎస్‌టీ శ్రీనివాసులు, నాగార్జున, సుధాకర రావు, తిమ్మరాజు, సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఈశ్వరయ్య, జి. శ్రీనివాసులు, ఫణీం ద్ర శర్మ, సుజాత, పెద్దరెడ్డయ్య, శివశంకరయ్య, మహేశ్వర నాయక్, భగీరథరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైపుల్లా కుటుంబానికి మంత్రి కేశవ్ పరామర్శ


మాజీ ఎంపీ సైపుల్లాను పరామర్శిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం రూరల్, మే4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ సైపుల్లా కుమారుడు కేఎం జకీవుల్లా ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం రాత్రి నగరంలోని సైపుల్లా గృహానికి వెళ్లారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జకీవుల్లా మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మాజీ ఎంపీ సైపుల్లాను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముందస్తు అడ్మిషన్లను కట్టడి చేయాలి : ఏఐఎస్‌ఎఫ్

అనంతపురం విద్య, మే 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో చేస్తున్న ముందస్తు అడ్మిషన్లను జిల్లా విద్యాశాఖాధికారులు వెంటనే అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... విద్యా ఏడాది ప్రారంభం కాకముందే.. నారాయణ, శ్రీచైతన్య, ఎడిఫై, ట్రిలిస్, ఏజీఎస్ తదితర కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు బారీగా చేస్తున్నారన్నారు. ఆ విద్యాసంస్థల పేరుతో పుస్తకాలు ముద్రించి అమ్ముతున్నారన్నారు. యూనిఫామ్, నోట్‌బుక్స్, ఇతర మెటీరియల్ వేల రూపాయలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. కొన్ని స్కూళ్లకు అనుమతులు లేకపోయినా నడుపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. అయినా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలేమీ తీసుకోవడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా ఇంటర్‌లో ఫస్ట్ ఇయర్ పూర్తి చేసుకున్న వారికి సెకెండ్ ఇయర్ క్లాసులు నిర్వహిస్తున్నా ఆర్ఐఓ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అడ్మిషన్లు, క్లాసులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దశాబ్దాల దారిచూపులు..!

20 కొట్టాల కాలనీ ఏర్పాటై 40 ఏళ్లు..

నేటికీ రోడ్డుకు నోచుకోని దుస్థితి


కొట్టాలకు సంబంధించిన దారి

అనంతపురంరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): అదో చిన్న కాలనీ. నగరానికి అతి సమీపంలోనే ఉంది. ఏర్పాటై 40 దశాబ్దాలు గడిచిపోయాయి. అయినా.. నేటికీ రోడ్డు లేదు. ఏళ్లుగా రోడ్డు వేయాలని పాలకులు, ప్రజాప్రతినిధులకు కాలనీవాసులు వినతులు సమర్పిస్తూనే ఉన్నారు. ఎవ్వరూ పట్టించుకున్న పాపానపోలేదు. కాలనీలో రోడ్డు వేస్తారో.. లేదో.. తాము రోడ్డు చేస్తామో.. లేదోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అనంత నగరానికి అత్యంత సమీపంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధి 20 కొట్టాల కాలనీలో దుస్థితి ఇది. 1986లో కొంతమంది స్థానికంగా గుడిసెలు వేసుకున్నారు. 1994లో 20మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అప్పటి నుంచి 20 కొట్టాల కాలనీ అనే పేరు పడిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అప్పట్నుంచి రోడ్డు కోసం స్థానికులు.. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నారు. అవన్నీ బుట్టదాఖలైనట్లు వారు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయంలో రాజీవ్ కాలనీ ప్రధాన బ్రిడ్జి నిర్మాణ క్రమంలో కాలనీలోని 20 ఇళ్లలో పది రోడ్డు విస్తరణలో పోయాయి. పది ఇళ్లు మాత్రమే మిగిలాయి. వాటి మధ్య వంద అడుగుల రోడ్డు కూడా వేయట్లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల ఏర్పాటైన కాలనీల్లో సైతం చకచకా రోడ్లు వేస్తున్నారనీ, తమ కాలనీపై మాత్రం చిన్నచూపు చూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు



కాలనీ ఏర్పాటైనప్పట్నుంచి రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తున్నాం. ఎవరూ పట్టించుకోవట్లేదు. -మహమ్మద్ వలి, స్థానికుడు

12 ఏళ్లుగా ఉంటున్నాం



కాలనీలో 12 ఏళ్లుగా నివాసముంటున్నాం. రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఎప్పటికి వేస్తారో.. ఏమో..?

-ప్రతాప్, స్థానికుడు

రాంభూపాల్ అక్రమాస్తులు ఉంటే.. పంచండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్‌కు అక్రమాస్తులు ఉంటే వెలికితీసి పంచిపెట్టాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప సవాల్ విసిరారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో రాంభూపాల్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ హయాంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి పెద్దారెడ్డి వచ్చి దౌర్జన్యం చేసినపుడు అందరికంటే ముందు విమర్శించింది అప్పటి సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాలేనని గుర్తించాలన్నారు. ఆనాడు పార్టీ రాష్ట్ర కమిటీ తరపున ఖండించడమేకాక జిల్లాలోని వామపక్షాలను కలుపుకుని వైసీపీని విమర్శించినట్లు తెలిపారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాసమస్యలు పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తూ పోరాడడమే తమ విధానమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ... ఎవరిపైనా వ్యక్తిగతంగా మాట్లాడే స్వభావం తమకు లేదని తెలిపారు. తన ఆస్తుల వివరాలను బయట పెడతామని జేసీ చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తనతోపాటు తన భార్య బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు వివరాలను జేసీకి పంపుతానన్నారు. ప్రస్తుతం నివాసముంటున్న ఒకటిన్నర సెంటు ఇల్లు తప్ప మరెక్కడైనా ఎలాంటి ఆస్తి ఉన్నా, బ్యాంకులో రూ.వెయ్యికి మించి డబ్బులున్నా ఎవ్వరికైనా దానం చేయొచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య పాల్గొన్నారు.

స్నేహబంధం ఎంతో విలువైనది

● పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులు

గార్లదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి జీవితంలో స్నేహ బంధం ఎంతో విలువైన దని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఇషాక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కన్నులపండువగా జరిగింది. దాదాపు 22 సంవత్సరాల తరువాత వారంతా ఒకచోట చేరి ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఇషాక్, శశిదేవి, కల్పలత, వేణుగోపాల్, బంగారప్ప, ఆదినారాయణ, ఎర్రిస్వామి, ఎలిజిబెత్, అనిల్, సాయినాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, రవిశాస్త్రి, జైరాఘవరెడ్డి, లింగమయ్య శ్రీకాంత్‌రెడ్డి, శివ, శ్రీనాథ్, పవన్, ఓబి, ద్వారకనాథ్, శేషు బాబు, శిరిష, సునిత, అరుణ, పావని, జయంతి, చంద్రకళ, శ్వేత, నరేష్, మల్లికార్జున, ఉమామహేష్, రమణ, వీరాంజి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా భగీరథుడి జయంతి


భగీరథుడి విగ్రహానికి పూలమాల వేసిన టీడీపీ నాయకులు

గుంతకల్లు, మే 4 (ఆంధ్రజ్యోతి): సగర (ఉప్పర) కులస్థుల ఆరాధ్యదైవమైన భగీరథ మహర్షి జయంతిని పట్టణంలోని టీడీపీ నాయకులు ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కసాపురం రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ.. భగీరథుడు పురాణ పురుషుడిగా, సగరుల కుల దైవంగా, గంగావతరణకు కారణ జన్ముడిగా ప్రశిద్ధుడన్నారు. ప్రభుత్వం భగీరథుడి జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, ప్రభాకర్, పత్తి హిమబిందు, వాసగిరి మణికంఠ, మత్రునాయక్, చిప్పగిరి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

●గుంతకల్లుటౌన్: పట్టణంలో సగర సేవా కార్యాలయంలో సగర సేవా సంఘం వారు భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నక్కా భీమలింగప్ప, పీపీ విశ్వనాథ్, సగర యువసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నక్కా నారప్ప, సభ్యులు పాల్గొన్నారు.

●గుత్తి: పట్టణంలో ఉప్పర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నగర సంఘం నాయకులు ప్రధాన వీధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకప్ప, వేణు, తిరుపతయ్య, నాగరాజు, శ్రీనివాసులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పేరులో బొడ్రాయి ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన బొడ్రాయి

కూడేరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గత రెండ్రోజులుగా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించడానికి వివిధ రకాల పూజలు, హోమాలు చేశారు. ఆదివారం ఉదయం వేద మంత్రోచ్చారణ నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గుంతకల్లుటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ వారు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. తొలుత స్థానిక కమిటీ కార్యాలయంలో హజరత్ టిప్పుసుల్తాన్ 226 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ భారత దేశ తొలి స్వాతంత్ర సమరయోధునిగా ప్రాణాలు అర్పించిన అమరుడు టిప్పుసుల్తాన్ అని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను అందజేశారు. కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మౌలా, పట్టణ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, కార్యదర్శి షేక్ ఇమ్రాన్, కోశాధికారి పఠాన్‌దాదాఖాన్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో సాయిబాబా

గుత్తి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 32వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో కాగడ హారతి చేపట్టారు. అనంతరం 108 కలశాలతో వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నుంచి సాయిబాబా ఆలయం వరకు మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. తర్వాత స్వామి మూలవిరాట్‌కు మంగళ స్నానం చేసి పుష్పాలతో అలంకరిం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

బచ్చనకల్లేరస్వామి పట్టాభిషేకం

కణేకల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో బచ్చనకల్లేరస్వామి పట్టాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయమే బ్యాళ్ల వంశం వారు సమీపంలోని వేదావతి హగరి నుంచి గంగాజలాన్ని తెచ్చి ఆలయం వద్ద జలప్రదక్షిణ నిర్వహించారు. అలాగే ఆహ్వానిత దేవుళ్లకు పూజ గావించి మహా మంగళహారతి ఇచ్చి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10:45 గంటల వరకు మిథునలగ్నంలో పట్టాభిషేకం చేసి ఆలయంలోని బచ్చనకల్లేరస్వామికి విశేషపూజలు జరిపారు. అలాగే వసికేరప్ప స్వామికి కూడా పట్టాభిషేకాన్ని నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ప్రశాంతంగా నీట్

గుత్తి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ పాఠశాలలో ఆదివారం చేపట్టిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకున్నారు. 279 మందికి గాను 274 మంది హాజరయ్యారు. వారిని తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

బెళుగుప్ప, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్యులు తమ ఆరాధ్యదైవం వాసవీమాత జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు పూజలు చేశారు. తర్వాత కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో సమర్పించారు. మహామంగళహారతి ఇవ్వడంతో వేడుకలు ముగిశాయి.

వైభవంగా బసవ జయంతి

కళ్యాణదుర్గం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బసవ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వీరశైవ సంఘం వారు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక బసవేశ్వర్ నగర్ నుంచి ధర్మవరం రోడ్డు వరకు చిత్రపటాన్ని ఊరేగింపు చేశారు. అందులో పలువురు కళాకారులు వివిధ వేషధారణలతో నృత్యాలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు.


ఊరేగింపులో కళాకారుల నృత్యం

పైసలిస్తేనే పని..!

- డబ్బులివ్వందే ఏ ఫైలూ కదలదు
- రేటు ఫిక్స్ చేస్తున్న ఓ అధికారి
- తహసీల్దార్ ఆఫీస్‌లో ఆయనదే హవా
- బావురుమంటున్న బాధితులు


విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం

విడపనకల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): ఏ పని జరగాలన్నా ఆయనే రేటు ఫిక్స్ చేస్తారు. అలా కాదంటే ఆ ఫైలు ఎన్నాళ్లయినా ముందుకు కదలదు. ఏదో ఒక క్వెరీతో ఆగిపోతుంది. ఇదంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి సాగిస్తున్న అరాచక పాలన. కేవలం ఫైల్స్ చూడాల్సిన ఆ అధికారి అన్ని విభాగాలను తన గుప్పెట్లో పెట్టుకుని హవా కొనసాగిస్తున్నాడు. ఈయన ఆరు మాసాల కిందట బదిలీపై విడపనకల్లుకు వచ్చాడు. అనతి కాలంలోనే పైసా ఇవ్వందే పని చేయడనే ముద్రను వేయించుకున్నాడు. మండల కేంద్రంలోని ఓ పత్రికా విలేకరి తన బంధువులకు చెందిన ఓ ఫైల్‌ను రెవెన్యూ అధికారుల వద్దకు తీసుకెళ్లాడు. దీన్ని చేయటానికి కూడా పైసలు డిమాండ్ చేసినట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోవడంతో రికార్డులు సరిగా లేవని దాన్ని తహసీల్దారు వద్దకు పంపకుండా నిలిపి వేశాడని ప్రచారం. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికీ ఓ రేటును నిర్ణయించి, వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పాస్‌బుక్ చేయాలంటే రూ.50 వేల నుంచి 80వేలు వసూలు చేస్తారు. పాస్ బుక్‌లో పేరు మార్చాలన్నా రూ. 50వేలు డిమాండ్ చేస్తున్నారు. అన్నదమ్ముల ఆస్తులకు పాబుక్‌లు చేయాలన్నా వేలలోనే వసూళ్లు చేస్తున్నారు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమైపోతుంది. కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నా అధికారులకు పైసలు ఇచ్చుకోవాల్సిందే. ఏదైనా సరే డబ్బిస్తేనే పని జరుగుతుంది. లేదంటే లేదు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా



నాకు సర్వే నంబరు 2ఏలో మాపెద్దల ఆస్తి 6 ఎకరాలు ఉంది. దానికి సంబంధించి ఆర్‌హెచ్, ఈసీ, 1బీ, అడంగల్ అన్ని నాపేరునే ఉన్నాయి. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం దేవాలయ భూమిగా చూపిస్తోంది. దాని తొలగించాలని నాలుగేళ్లుగా రెవెన్యూ కార్యాలయం, దేవదాయ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. అధికారులకు రూ. 60 వేల నుంచి రూ.70 వేలు ఖర్చు చేశా. ఒక్క అధికారి స్పందించటంలేదు రెవెన్యూ కార్యాలయం వద్దకు రోజూ రావటం ప్రతి అధికారిని అడగటం తిరిగి ఇంటికి వెళ్లటం.. ఇదే పనిగా ఉంది. మా భూమికి ఆనుకొని దేవాలయ భూమి ఉండటంతో మా భూమిని కూడా అందులో చూపించారని దేవాలయ అధికారులు చెబుతున్నారు. దేవాలయ కమిషనర్ వద్దకు వెళ్లి ఎన్‌ఓసీ తెచ్చుకుంటే మాభూమి మాకు చేస్తారంటా?

-సుధాకర్, పాల్తూరు రైతు

రికార్డుల్లో నాకు భూమే లేదంట



నాకు మా పెద్దల ఆస్తి 6.69 ఎకరాలు సంక్రమించింది. దాన్ని వేరే వాళ్ల పాస్ బుక్‌లోకి ఎక్కించారు. సర్వే నంబరు 382, 385లో 6.69 ఎకరాలు భూమి ఉంది. దాన్ని నేనే సాగు చేస్తున్నా. సర్వే కూడా చేయించారు. సాగులో నేను ఉన్నట్లు ధ్రువీకరించారు. వీటికి అన్నిటికి నా చేత దాదాపుగా రూ. 80వేలు ఖర్చు చేయించారు. రెవెన్యూ అధికారులు అడిగినంత ఇవ్వలేదని నాభూమి రికార్డుల్లోనే లేకుండా చేశారు. కనీసం మిగులు భూమి కూడా చూపించటం లేదు. ఐదేళ్లుగా తిరిగి తిరిగి అలసి పోయా. నన్ను పట్టించుకునే నాథుడే లేడు. పైసలిస్తేనే పనులు చేస్తారు లేకపోతే అస్సలు పట్టించుకోరు.

- ఖాజాపీరా, పాల్తూరు రైతు

నా దృష్టికి రాలేదు

నాకు ఫైళ్లు అధికంగా వస్తుండటంతో పరిశీలించేందుకు ఓ అధికారిని ఏర్పాటు చేశా. అతను వసూళ్లకు పాల్పడుతున్నట్లు నా నోటీసుకు రాలేదు. కార్యాలయంలో అందరితో సమావేశం ఏర్పాటు చేసి, వసూళ్ల కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తా. రైతులు ఏ సమస్యలు ఉన్నా నేరుగా నావద్దకు వచ్చి అర్జీలు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తా. నాకు తెలిసి మా సిబ్బంది ఎవరూ ఎటువంటి పైసలు వసూలు చేయటం లేదు. అలా ఎవరైనా వసూలు చేశారని ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటాం.

-చంద్రశేఖరయ్య, తహసీల్దారు, విడపనకల్లు

హంద్రీనీవా పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్


హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ఉరవకొండ/ బెళుగుప్ప, మే 4 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని వజ్రకరూరు, ఉరవకొండ, బెళుగుప్ప మండలాల్లో జరుగుతున్న హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రాగులపాడు పంపు హౌస్ వద్ద, కౌకుంట్ల సమీపంలోని 211 కిలో మీటర్ వద్ద, జీడిపల్లి రిజర్వాయర్ సమీపంలో జరుగుతున్న పనులను పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, ఆర్డీఓలు వసంతబాబు, శ్రీనివాస్, ఈఈలు శ్రీనివాస్ నాయక్, శ్రీనివాసులు, తహసీల్దార్లు మహబూబ్ బాషా, నరేష్‌కుమార్, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి: కాలవ


వైద్యశిబిరంలో ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని సెయింట్ పాల్స్ స్కూల్ ఆవరణలో ఆదివారం పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా కాలవ పాల్గొని మాట్లాడారు. ఉచిత వైద్యశిబిరాల్లో బీపీ, ఇతరత్రా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యనిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి శిబిరాల్లో పరీక్షలు చేయించుకుంటే అంతర్గత వ్యాధులు బయట పడతాయని తెలిపారు. దీంతో సకాలంలో వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మోదీ వాగ్దానాలన్నీ అవాస్తవాలే..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవసరానికి వాగ్దానాలు చేసి తర్వాత వాటి ఊసే ఎత్తరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ. జగదీశ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం బీహార్‌లో ఎన్నికలుండగా.. ఇన్నాళ్లు మాట్లాడని కులగణన విషయంపై ఇప్పుడు పీఎం కేంద్ర కేబినెట్‌లో తీర్మానం చేశారన్నారు. కులగణన చేపట్టాలని కాంగ్రెస్, సీపీఐ కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నాయన్నారు. బీహార్‌లో ఓట్లు రాల్చుకోవడానికి పీఎం మోదీ ఇప్పుడు కుల గణన రాగం అందుకున్నారన్నారు. ఇన్నాళ్లు అధికారం ఉన్న రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. గతంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి, తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. కులగణన హామీ కూడా అలాంటిదేనన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రుణాన్ని ఇచ్చారేగానీ, గ్రాంట్లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం టీడీపీ మద్దతుతోనే అధికారంలో ఉన్నందున హోదా విషయంగా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని, తాము కలిసి వస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బీ.గోవిందు, వీరభద్రస్వామి, బీ.మహేశ్, గోపీ మహమ్మద్ గౌస్, రాయల్ రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

తాడిపత్రి, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ తదితర వాటి సాధనకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొల్పిందన్నారు. అయితే ప్రస్తు త ప్రభుత్వం కూడా అదేబాటలో పయ నిస్తోందని ఆరోపించారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉండగా.. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంవతో అనంతపురానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

తాడిపత్రి, మే4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బ్లాక్ స్పాట్ రహదారుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. చుక్కలూరు గ్రామంతోపాటు చుక్కలూరు క్రాస్, కడపరహదారిలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు.

జూదరుల అరెస్టు

రాయదుర్గం, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మొలకాల్మూ రు రోడ్డు సమీపంలో తోటలో గల పేకాట కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. అందులో పేకాటాడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 75,840 నగదు, 7 ద్విచక్రవాహనాలు, పది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. అరెస్టయిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


రాయలచెరువులో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


కడవకల్లు జడ్పీ హైస్కూల్లో..


కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


గుంతకల్లులోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో..

యాడికి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలోనే 1999-2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత నాటి ఉపాధ్యాయులు జయదీవెన, నాగరాజుశర్మ, సుబ్రమణ్యం, రమేష్, మల్లికార్జున, లక్ష్మీదేవి, నబీరసూల్, రవిబాబులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

●పుట్లూరు: మండలంలోని కడవకల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గెట్‌టుగెదర్ నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత వారందరూ అదే పాఠశాలలోనే కలుసుకుని ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. తాడిపత్రి ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

●కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1997-2000వ విద్యాసంవత్సరాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులంతా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అదే కళాశాలలోనే కలిసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు.నాటి అధ్యాపకులను సన్మానించారు.

●గుంతకల్లుటౌన్: పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. కళాశాలలో 2002-2005వ విద్యాసంవత్సరాల్లో బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్‌లో డిగ్రీ చదివిన విద్యార్థులు మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఒక్కటిగా కలిశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి అధ్యాపకులను సన్మానించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు సన్మానం


ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో విజయ్‌కుమార్‌నాయుడు

పుట్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు టీడీపీ మండల నాయకుడు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్‌నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురంలోని నివాసంలో ఎమ్మెల్యేను ఆదివారం ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అలాగే టీడీపీ కన్వీనర్ బాలరంగయ్య. నాయకులు సుదర్శన్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి


వడ్డే నాగేంద్ర (ఫైల్)

పామిడి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్రిమల గ్రామంలో ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేర కు వివరాలిలా ఉన్నాయి. కత్రిమలకు చెందిన వడ్డే నా గేంద్ర (26) గేదెలు మేపుతూ జీవనం కొనసాగించేవా డు. కాగా వాటి ఎరువు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు కల్లందొడ్డిని కొనుగోలు చేశాడు. అయితే అప్పటికే ఆ కల్లందొడ్డిని వినియోగించుకుంటున్న పెద్దసుబ్బారెడ్డి కుటుంబీకులు అతడితో ఈనెల 2న గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం చేసుకున్నారు. అనంతరం అదేరోజు అర్ధరాత్రి పెద్దసుబ్బారెడ్డి కుటుంబీకులతో పాటు వారి బంధువులు వచ్చి వడ్డే నాగేంద్రపై దాడికి పాల్పడ్డారు. ఇందులో అతను తీవ్రంగా గాయపడగా.. స్థానికులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య వడ్డే అనూషతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త..


గొల్ల చంద్రప్ప (ఫైల్)

కుందుర్పి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గొల్ల చంద్రప్ప (55) గుండెపోటుతో ఆదివారం మృతి చెం దారు. ఆయన వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. ఈ క్రమంలో పనులకు వెళ్లిన ఆయన పొ లంలోనే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సర్పంచ్ నాగేంద్ర మాజీ సర్పంచ్ చిత్రలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


ఈశ్వరమ్మ మృతదేహం

గుమ్మఘట్ట, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగచేడు గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన చిరంజీవి, ఈశ్వరమ్మ (29)భార్యాభర్తలు. ఈశ్వరమ్మ కొద్దినెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్సలు చేయించినా నయం కాలేదు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు భర్త, ఇతర కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

కూడేరు, మే 4, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎడమల శివయ్య (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

రెండిళ్లలో చోరీ

గుంతకల్లుటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దార్థనగర్‌లో గల రెండిళ్లలో చోరీ జరిగింది. అక్కడ నివాసముంటున్న రైల్వే ఉద్యోగి శరత్‌బాబు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి చోరీ చేశారు. విషయం తెలుసుకున్న శరత్‌బాబు ఆదివారం వచ్చి బీరువాలోని 13తులాల బంగారు నగలు, రూ.2 వేల నగదు ఎత్తుకెళ్లారని కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే అదే కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి రామాంజనేయులు ఇంటికి తాళం వేసి బెంగళూరుకు వెళ్లారు. అతడి ఇంట్లోకి దుండగులు చోరీ చేశారు. ఈ విషయాన్ని స్థానికులు ఫోన్ ద్వారా బాధితుడికి సమాచారం అందించారు. ఆ ఇంట్లో ఎంత చోరీ జరిగిందనే విషయం అతను బెంగళూరు నుంచి వస్తే తెలుస్తుంది. చోరీ జరిగిన ఇళ్లను కసాపురం ఇన్‌చార్జి ఎస్ఐ రాఘవేంద్ర సిబ్బందితో కలిసి పరిశీలించారు.

వడ్డెర్ల సమావేశం..

ఉరవకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో ఆదివారం వడ్డెర్ల సమావేశం జరిగింది. ఇందులో వడ్డెర సంఘం జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ..సమస్యల పరిష్కారం కోసం వడ్డెర్లు ఐక్యంగా ముందుకెళదామని పిలుపునిచ్చారు. వడ్డెర్ల రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దన్న, శ్రీరాములు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఖత్నా

రాయదుర్గం/ ఉరవకొండ/ పామిడి మే 4(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పట్టణంలోని జామియా అన్వరుల్ ఉలుమ్ మదరసా వద్ద ఆదివారం అంజుమన్ అజమతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో 142 మంది ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా నిర్వహించారు. అనంతరం ఖత్నా చేసుకున్న బాలురకు 12 రకాల నిత్యావసర సరుకులను అందించారు. కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, కార్యదర్శి లడ్డు మహ్మద్ షఫీ, కోశాధికారి అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని హజరత్ సయ్యద్ షా జామలుద్దీన్ ఖాద్రి దర్గా ఆవరణలో జామియా తాసిరియా ఎడ్యుకేషన్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో 45 మంది బాలురకు వైద్యులు ఖాజాపీరా, నిజాముద్దీన్, లోక్‌నాథ్ ఖత్నా చేశారు. అనంతరం ఉచితంగా మందులను, పౌష్టికార పదార్థాలను అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పామిడి పట్టణంలోని షాదీఖానాలో ముస్లింమైనారిటీలు 50 మంది బాలురకు ఉచిత ఖత్నా నిర్వహించారు. అలాగే వారికి నిత్యవసర సరుకులు అందజేశారు.

పహల్గాం మృతులకు నివాళి..

శెట్టూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన 28 మంది భారతీయులకు మండల కేంద్రంలోని టీడీపీ, వైసీపీ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. తొలుత స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండు వద్ద నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. పలువురు మాట్లాడుతూ దాడులు చేసిన ఉగ్రవాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ కుమార్, వివిధ పార్టీ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు